క్లుప్తంగా

జగన్‌ను కలిసిన జెడ్పీటీసీ



మాజీ సీఎం జగన్‌ను కలిసిన జెడ్పీటీసీ ప్రసన్నకుమారి

మలికిపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మలికిపురం జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆమె జగన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం శ్రమించాలని జగన్ సూచించినట్టు ప్రసన్నకుమారి వివరించారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి



కడలిలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రాజోలు: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని పాదలాడ నీటి సంఘం అధ్యక్షుడు ఉలిశెట్టి లక్ష్మణరావు అన్నారు. గురువారం కడలి-2 సచివాలయం పరిధిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ దివ్యదర్శిని మాట్లాడుతూ టీబీ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామంలో పలువురు అనుమానితులకు కళ్లె పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంపీహెచ్ఈఓ కె.త్రినాథరావు, ఎస్‌టీఎల్ఎస్ జి.సర్వారాయుడు, ఎంపీహెచ్ఎస్‌లు దీప్తి, రోజారాణి, లుథియా, శిరీష, ఏఎన్ఎం నాగమణి, హెల్త్ అసిస్టెంట్ ఎం.ఏడుకొండలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫర్నిచర్ అందజేత

ఆలమూరు: స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయానికి పాఠకుల సౌకర్యార్థం గురువారం ఫర్నిచర్ వితరణ జరిగింది. గ్రామానికి చెందిన గొడవర్తి సత్యానందం (బండబ్బు) జ్ఞాపకార్థం కుమారుడు వెంకట నారాయణ రూ.12వేల విలువైన టేబుల్స్, కుర్చీలు అందజేశారు. గ్రంథాలయం తొలి అంతస్తు నిర్మాణం పూర్తి కావడంతో పాఠకుల సౌకర్యార్థం ఈ ఫర్నిచర్‌ను అందించినట్టు గ్రంథాలయ పాలకుడు టి.నమశ్శివాయ తెలిపారు.

కల్యాణ మంటపానికి రూ.30 లక్షల మంజూరు



పినపళ్లలో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మంటపం

ఆలమూరు: పినపళ్లలో అసంపూర్తిగా ఉన్న శ్రీసంగిత లక్ష్మీకాంతం కల్యాణ మండపం నిర్మాణానికి రూ.30 లక్షల మంజూరు చేశారు. జాతీయ బీసీ సంఘ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఈనిధులను మంజూరు చేసినట్టు సర్పంచ్ సంగిత సుభాష్ గురువారం తెలిపారు. ఈ నిధులకు సంబంధించి త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లను ఖరారు చేసి పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు.

క్రిస్టియన్ మైనార్టీ సంయుక్త కార్యదర్శిగా రత్నంరాజ్

అమలాపురం టౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకుడు వజ్జరపు రత్నంరాజ్‌ను పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావులు రత్నంరాజ్‌ను అభినందించారు.

రైతులకు ప్రయోజనం చేకూరేలా పనిచేయాలి

అంబాజీపేట: రైతులకు ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు పని చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యనారాయణ,టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ.రమేష్ సమక్షంలో నూతన పాలక వర్గం సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రేడ్-2 సెక్రటరీ వి.రామకృష్ణ పాల్గొన్నారు.

శాకంబరిగా పెద్దింట్లమ్మ

రావులపాలెం: స్థానిక కొత్త కాలనీలో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మూతపడిన కల్యాణ మంటపం

- రెండేళ్లుగా ఇదే తంతు
- దాత ఆశయానికి తూట్లు
- ప్రాంగణమంతా మొలిచిన పిచ్చిమొక్కలు

మామిడికుదురు: మంచి ఆశయంతో రూ.కోట్లు విలువైన భూమిని టీటీడీ కల్యాణం మంటపానికి దాత పేరిట దానం చేశారు. ఎన్నో బాలారిష్టాలు దాటుకుని కల్యాణ మంటపం నిర్మించారు. కల్యాణ మంటపం కట్టారన్న ఆనందం ఎంతో కాలం నిలవలేదు. రెండేళ్ల నుంచి కల్యాణ మంటపం మూతపడింది. దీన్ని పునః ప్రారంభించాలన్న ధ్యాస ఏ ఒక్కరిలోనూ లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మంటపం ఉన్న ప్రాంతం చుట్టూ పిచ్చి మొక్కలు, గడ్డి మొలిచిపోయి చిన్న సైజు అడవిలా మారింది. మండల కేంద్రం మామిడికుదురులో దాత ఈలి రంగయ్య పేరిట కల్యాణ మంటపం నిర్మించేందుకు అతని కుటుంబ సభ్యులు ఎకరం స్థలాన్ని దానం చేశారు. జాతీయ రహదారికి పక్కనే ఎంతో విలువైన స్థలంలో సుమారు రూ.55 లక్షలతో కల్యాణ మంటపం నిర్మించారు. దీన్ని 2010 ఏప్రిల్ 11న అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. అంతవరకూ బాగానే ఉంది. కొంత కాలం వరకు ఇక్కడ రికార్డు సంఖ్యలో వివాహాలు జరిగాయి. తర్వాత నుంచే సమస్యలు మొదలయ్యాయి.

అన్నీ మూసేశారు

ఈ కల్యాణ మంటపంలో వివాహాలతో పాటు ఈ-దర్శనం కౌంటర్ కూడా ప్రారంభించారు. టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యురాలు పాముల రాజేశ్వరీదేవి చొరవతో ఈ-దర్శనం కౌంటర్ ప్రారంభించారు. చాలా కాలం ఈ కౌంటర్ ద్వారా భక్తులకు సేవలందించారు. కాలక్రమేణా దాన్ని మూసేశారు. కల్యాణ మంటపంపై భాగంలో వేసిన సీలింగ్ పెచ్చులు, పెచ్చులుగా ఊడి పడిపోవడంతో కల్యాణ మంటపం రెండేళ్ల క్రితం మూతపడింది. మళ్లీ దాని వైపు ఏ ఒక్కరూ కన్నెత్తి కూడా చూడలేదు. మంటపం పైభాగంలో వేసిన రేకును తొలగించి దాని స్థానే శ్లాబ్ వేయాలని పలువురు సూచిస్తున్నారు. శ్లాబ్ వేయడం ఒక్కటే సమస్యకు పరిష్కారం అన్న వాదన వినిపిస్తోంది. ఈ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు.



నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మంటపం

మంటపాన్ని పునః ప్రారంభించాలి



రెండేళ్ల నుంచి మూత పడిన టీటీడీ కల్యాణ మంటపానికి పూర్వ వైభవం తీసుకురావాలి. ఆ దిశగా సంబంధిత ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలి. ప్రజలకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతోనే కల్యాణ మంటపం నిర్మాణానికి స్థలం దానం చేశాం. కానీ దాన్ని రెండేళ్లుగా మూసేసి ఉంచడం దారుణం. ఇది మాకు ఎంతో బాధ కలిగిస్తోంది. దీన్ని తిరిగి ప్రారంభించాలి. ఆ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

– ఈలి శ్రీనివాస్, స్థలదాత

టీటీడీకి నివేదించాం



మామిడికుదురు టీటీడీ కల్యాణ మంటపం సమస్యపై టీటీడీకి నివేదించాం. మంటపం పైన వేసిన ఆర్‌సీసీ రేకులు తొలగించి శ్లాబ్ వేయాలని సూచించారు. కల్యాణ మంటపం ఆవరణను గ్రావెల్‌తో లెవెలింగ్ చేయాలని విన్నవించాం. కిటికీలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, తాగునీరు సరఫరాకు పైప్‌లైన్లు చేయాలని, పలు సమస్యలు పరిష్కరించి హంగులతో ఆధునీకరించాలని కోరాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి



మోరిలో వైఎస్సార్ సీపీ కొత్త కార్యవర్గం సభ్యులతో నాయకులు

సఖినేటిపల్లి: గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కష్టించి పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం మోరిలో పార్టీ చేనేత రాష్ట్ర ప్రతినిధి జాన శంకరరావు ఇంటి వద్ద ఆయన అధ్యక్షతన రాజోలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు సూచనలతో పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రశేఖర్ పర్యవేక్షణలో గ్రామ అధ్యక్షుడిగా బళ్ల వీర్రాజు, జనరల్ సెక్రటరీగా భైరవశెట్టి శివ ఎన్నుకున్నారు. ఇతర కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, లీగల్ విభాగం ప్రతినిధి దివ్వి చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి ఈద రవిరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రతినిధి తాడి సహదేవ్, మండల జనరల్ సెక్రటరీ ముప్పర్తి వంశీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు అత్యాధునిక పోస్టల్ సేవలు

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- రాజోలులో నూతన పోస్టాఫీసు భవనం ప్రారంభం

రాజోలు: భారత పోస్టల్ శాఖ గ్రామీణ ప్రాంతాలకు అత్యాధునిక పోస్టల్ సేవలు అందిస్తుందని కేంద్ర సమాచార, గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం రాజోలులో రూ.2.27 కోట్లతో నిర్మాణం చేసిన పోస్టాఫీసు నూతన భవనాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. కొత్త పోస్టాఫీసు భవనం వద్ద ఏర్పాటు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం శివకోటి కాపు కల్యాణ మండపంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీఎస్‌బీ వీరాంజనేయస్వామిలు పాల్గొని ప్రసంగించారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న కంప్యూటర్ యుగంలో పోస్టల్‌శాఖ నిరంతరం ఎలాంటి అవరోధాలు రాకుండా ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. తపాలా, బీమా, రైల్వే రిజర్వేషన్, ఆధార్, బ్యాంకింగ్ వంటి సదుపాయాలను అందుబాటులోకి తీసుకుని వచ్చారన్నారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా జీఏజీ పాలసీ తీసుకుని మృతి చెందిన నేదునూరు గ్రామానికి చెందిన బొక్కా మధుసూదనరావు కుటుంబానికి మంజూరైన రూ.10 లక్షల చెక్కును కేంద్ర మంత్రి చంద్రశేఖర్ అందజేశారు. అలాగే సుకన్య సంవృద్ధి ఖాతా పుస్తకాలను అందజేశారు. రాజోలులోని కొత్త పోస్టాఫీసు భవనం నిర్మాణానికి స్థల సేకరణలో అప్పటి తహసీల్దారు చిట్టూరి రామకృష్ణ ఎంతో కృషి చేశారని పోస్టల్ ఉన్నతాధికారులకు స్థానిక సిబ్బంది వివరించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, బొమ్మి ఇశ్రాయేల్, రాష్ట్ర చీఫ్ పోస్టుమాస్టర్ బి.పి.శ్రీదేవి, పోస్టల్ జనరల్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ కె.సంతోష్‌నేత తదతరులు పాల్గొన్నారు.



రాజోలులో పోస్టాఫీసు భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక రెండోసారి వాయిదా

రాజోలు: స్థానిక మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక గురువారం రెండోసారి వాయిదా పడింది. ఎన్నికల పరిశీలకురాలు, డీఆర్వో రాజకుమారి ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికకు సమావేశం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. టీడీపీ అధిష్ఠానం సూచనల మేరకు ఆ పార్టీకి చెందిన ఎంపీటీసీలతోపాటు, జనసేన ఎంపీటీసీలు అధ్యక్ష ఎన్నిక సమావేశానికి దూరమయ్యారు. కేవలం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, ఇండిపెండెంట్ ఎంపీటీసీ కట్టా కృష్ణ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. కోరం సరిపడకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాజోలు మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికల్లో జరిగిన పరిణామాలను వివరిస్తామని పరిశీలకురాలు రాజకుమారి తెలిపారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్ ఇటీవల చనిపోవడంతో ఎంపీపీ స్థానం ఖాళీ ఏర్పడింది. ఆయన చనిపోయి 15 రోజులు కూడా కాకుండానే అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేయడంపై ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడుకి వారు ఫిర్యాదు చేయడంతో అధ్యక్ష ఎన్నిక సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు ఎవరూ హాజరు కాకుండా చూడాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదేశానుసారం ఎంపీటీసీలు అధ్యక్ష ఎన్నిక సమావేశానికి గైర్హాజరయ్యారు. భవిష్యత్‌లో ఎంపీపీ స్థానాన్ని కేతా శ్రీనివాస్ భార్య వెంకటలక్ష్మికి ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. అంతవరకు ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాన్ని తాత్కాలికంగా మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న ఇంటిపల్లి ఆనందరాజు, పొలమూరి శ్యాంబాబుల్లో ఒకరికి అప్పగించే అవకాశం ఉంది.



అధ్యక్ష ఎన్నిక సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు

ప్రజల పక్షాన పోరాటం చేయండి



పిఠాపురం ఇన్‌చార్జి గీతను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

మామిడికుదురు: ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని రాజ్యసభ మాజీ సభ్యురాలు, పిఠాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత పార్టీ శ్రేణులకు సూచించారు. ఆమె గురువారం కొమరాడ వచ్చారు. ఈ సందర్భంగా మంటపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిశోర్, జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణు, తోరం భాస్కర్, భూపతి మహేంద్ర, మద్దాల ప్రభాకర్, పోలమూరి గోపాల్ తదితరులు గీతను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆ ప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడమే ప్రధాన అజెండాగా ముందుకు సాగాలని గీత సూచించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకుందామన్నారు. దాని ప్రకారమే నియోజకవర్గాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలతో కటౌట్ ఏర్పాటు



జొన్నాడ కూడలిలో ఏర్పాటు చేసిన బోర్డులు

ఆలమూరు: జొన్నాడలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తూ గురువారం పోలీసు కటౌట్ ఏర్పాటు చేశారు. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆదేశాల మేరకు ఆలమూరు ఎస్సై జి.నరేష్ నేతృత్వంలో పోలీసు సిబ్బంది స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తెలియజేస్తూ కటౌట్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని, మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని కోరారు.

జాబ్ మేళాలో 51 మందికి ఉద్యోగాలు

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 51 మందిని వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ అమలాపురం, వికాస, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ కాకినాడ,వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ, ప్లేస్మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన జాబ్‌మేళా నిర్వహించారు. 12 కంపెనీలు జాబ్ మేళా నిర్వహించగా 146 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వారి అర్హతలు పరిశీలించి, వారిలో 51 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసి, ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. మరో 29 మంది అభ్యర్థులు తదుపరి ప్రక్రియకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ డీ హరిశేషు, వికాస మేనేజర్ జీ రమేష్, మినిస్ట్రీ ఆఫ్ లేబర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పీ ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్‌డీసీ సిబ్బంది, వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, ప్లేస్మెంట్ ఆఫీసర్ అండ్ జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ శ్రీనివాసులు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ కేపీ రాజు తదితరులు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు రమణకుమారి

మామిడికుదురు: గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని పాశర్లపూడిలో గురువారం జరిగిన మండల సర్పంచుల సమాఖ్య సమావేశం డిమాండ్ చేసింది. సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణ కుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. 2025వ సంవత్సరానికి రావాల్సిన నిధులు ఇంత వరకు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు కూడా నిధులు లేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించి వెంటనే పంచాయతీలకు నిధులు విడుదల చేయాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు సక్రమంగా వేయడం లేదని వాపోయారు. దీని వల్ల గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని దీనిపై అధికారులు తగిన విధంగా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం ఆరు గంటలకే కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండడం మంచి పరిణామమని తర్వాత కూడా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సమాఖ్య కార్యదర్శి బళ్ల శ్రీనివాసరావు, కోనుకు ప్రేమజ్యోతి, అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, గుబ్బల దుర్గ, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, మద్దాల బాబూరావు, అల్లు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తొత్తరమూడిలో ఎస్ఎస్‌జీ బృందం పర్యటన



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎస్‌జీ బృందం

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామంలో ఎస్ఎస్‌జీ బృందం గురువారం పర్యటించింది. ఈ బృందం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రముఖ దేవాలయాలు, కేంద్ర ప్రభుత్వం సూచించిన 16 ఇళ్లను పరిశీలించింది. గ్రామంలో పాటిస్తున్న పారిశుద్ధ్య చర్యలపై ప్రజలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. టీమ్ లీడర్ ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలో 32 ఎస్ఎస్‌జీ గ్రామాలు ఎంపికైనట్టు తెలిపారు. వాటిలో తొత్తరమూడి ఒకటి అన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య చర్యలపై నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. వీరి వెంట గ్రామ సర్పంచ్ వార జయసావిత్రి, పంచాయతీ కార్యదర్శులు కె.రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం గ్రామంలో వశిష్ట నదీపాయలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు పడవలపై ఇసుక తవ్వేస్తున్నారు. అక్రమంగా పడవల ద్వారా ఇసుకను తీసి ట్రాక్టర్లపై లోడు చేసి విక్రయిస్తున్నారు. వరదల సమయంలో సైతం ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పి.గన్నవరం: నరేంద్రపురం గురుకుల పాఠశాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, డీసీఓ కె.శైలజ, జెడ్పీ చైర్మన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

కొత్తపేట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)నకు నియమితులైన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కూటమిలో ఈ పీఏసీఎస్‌ను జనసేన, బీజేపీ సభ్యులకు కేటాయించారు. ఆ మేరకు చైర్మన్‌గా కంఠంశెట్టి (చంటి), సభ్యులుగా వాసంశెట్టి సత్యనారాయణ (జనసేన), పాలూరి జయప్రకాష్‌నారాయణ(బీజేపీ)లను ప్రభుత్వం నియమించింది. పీఏసీఎస్ సీఈఓ జగత ప్రసాద్ వారికి ప్రభుత్వ నియామకపత్రాన్ని అందజేసి, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సొసైటీ రికార్డుల్లో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన అభినందన సభలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దే ఆదినారాయణ, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అయినవెల్లి సత్తిబాబు, మాజీ సర్పంచ్ చింతం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చంటి

ఆలమూరు: స్థానిక బొబ్బా చిన వీరన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా వంటిపల్లి సతీష్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు, గుడాల నాగ వెంకట్రావు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఈసందర్భంగా త్రిసభ్య కమిటీ సభ్యులకు పలువురు కూటమి నేతలు పూలమాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

మహిళల భద్రతలో ప్రభుత్వాలు విఫలం

మామిడికుదురు: మహిళలకు భద్రత కల్పించలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని భారతీయ చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ అన్నారు. అప్పనపల్లిలో శ్రీయశోధకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 80-85 శాతం ఉన్న వెనుకబడి వర్గాలు, దళితులు, మైనార్టీలు అణచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు రావాలి, రాజకీయం మారాలి, ప్రజా రాజకీయం రావాలన్న లక్ష్యంతో భారతీయ చైతన్య యువజన పార్టీ ఏర్పాటు చేశామన్నారు. అన్ని వర్గాల మద్దతు, సహకారంతో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిట్టిమేను ఏడుకొండలు, నాగళ్ల లక్ష్మీనారాయణ, నాగళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అప్పనపల్లి విచ్చేసిన రామచంద్ర యాదవ్‌కు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. అప్పనపల్లిలోని వీరభద్రస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు.

బీసీ రక్షణ చట్టం అమలు చేయాలి

రావులపాలెం: రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టాని అమలు చేయాలని, రాష్ట్రంలో రెండే ప్రధాన పార్టీలు రాజ్యమేలుతున్నాయని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. రావులపాలెంలోని సీఆర్‌సీ ఓల్డేజ్ హోమ్ ఆవరణలో గురువారం బీసీల ఆత్మీయ సమావేశాన్ని సంఘ సభ్యులు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రామచంద్రయాదవ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ పార్టీలు రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి, మహిళలు, రైతులకు ఏ విధంగా మేలు చేయాలి అని కాకుండా రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకోవాలని చూస్తున్నారన్నారు. చంద్రబాబు ముడుపుల కోసమే బనకచర్ల ప్రాజెక్టు జపం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు అయ్యిందని కాని బీసీ రక్షణ చట్టం గురించి ఎందుకు మాట్లాడడం లేదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రెండు పార్టీలు విఫలమయ్యాయన్నారు. తొలుత ఆయన వాడపల్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నట్టు బీసీ సంఘం సభ్యులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పినపళ్ల, పెదపళ్ల, నర్సిపూడి, నవాబుపేట, గుమ్మిలేరు, మోదుకూరు, పెనికేరు, కలవచర్ల, ఆలమూరు, జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సరఫరాను నిలిపివేయనున్నామన్నారు.

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆదిలక్ష్మి నగర్, భద్ర మంకాలమ్మ గుడి ఏరియా, మార్కెట్ ఏరియా, ఎంప్లాయిస్ కాలనీ, ఇందిరా కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే ఈతకోట సబ్ స్టేషన్ పరిధిలో ఈతకోట సెక్షన్ పరిధిలోని చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.